
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 19.5

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

గురువారం 1 ఫిబ్రవరి 2024



ముస్తాబైన అమరవీరుల స్తూపం




కొనసాగుతున్న సభా వేదిక పనులు



కమలం పార్టీలో.. అసమ్మతి సెగ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై భిన్నాభిప్రాయాలు
- అధిష్ఠానం తీరుతో జిల్లా సీనియర్ నేతల అసంతృప్తి
- చక్రం తిప్పిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే
- పార్లమెంట్ ఎన్నికల ముందు పార్టీలో విభేదాలు





ఆదిలాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎంపిక కమలం పార్టీలో అసమ్మతి సెగలు రేపుతోంది. అంతర్గతంగా పలువురు నేతలు అధిష్ఠానం తీరుపై మండిపడుతున్నారు. సీనియర్ నేతలను కాదని.. జూనియర్ నేతకు పార్టీ కీలక బాధ్యతలను అప్పగించడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం పలు వురు నేతలు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ముఖ్యంగా లోక ప్రవీణ్‌రెడ్డి, ఆదినాథ్, సుహాసినిరెడ్డి, సాకటి దశరథ్‌లు అధ్యక్ష పదవిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ అనూహ్యంగా అసలు పోటీలో లేని గుడిహత్నూర్ జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్‌ను జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించడంపై బీజేపీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి కాకుండా.. బోథ్ నియోజకవర్గానికి చెందిన నేతకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై అసలు ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గత పక్షం రోజుల క్రితమే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకం జరిగింది. కానీ బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడి ఎంపికను అర్థాంతరంగా నిలిపివేశారు. అప్పట్లోనే పార్టీ అధిష్ఠానం పెద్దలు బోథ్ నియోజకవర్గానికి చెందిన సాకటి దశరథ్ పేరును దాదాపుగా ఖరారు చేసినట్లు ప్రచారం జరిగింది. కానీ కొందరు నేతల ఒత్తిళ్లతో అధిష్ఠానం వెనుకడుగు వేసినట్లు తెలిసింది. అయితే పార్లమెంట్ ఎన్నికలకు ముందు జిల్లా అధ్యక్షుడి నియామకం పార్టీలో కొత్త వివాదానికి కారణమవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సీనియర్ నేతలకు షాక్

జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పతంగే బ్రహ్మానంద్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుని సీనియర్ నేతలకు షాకిచ్చింది. దీంతో సీనియర్లకు మళ్లీ నిరాశనే ఎదురయ్యింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌కు అత్యంత సన్నిహితంగా ఉంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన లోక ప్రవీణ్‌రెడ్డితో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్‌ను ఆశించిన సుహాసినిరెడ్డి, సాకటి దశరథ్ అధ్యక్ష పదవి కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నా.. చివరకు నిరాశనే మిగిలింది. పలుమార్లు రాష్ట్ర, కేంద్ర స్థాయి నేతలతో సంప్రదింపులు జరిపినప్పటికీ.. ప్రయోజనం కనిపించలేదు. ఎవరూ ఊహించని విధంగా జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎంపికను చేపట్టడంతో పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎస్టీ రిజర్వ్‌డు నియోజకవర్గమైన బోథ్ నియోజకవర్గం నుంచి ఆదివాసీ నేతకు అవకాశం కల్పించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను సమర్థవంతంగా ఎదుర్కొనే బలమైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకు పార్టీ బాధ్యతలను అప్పగించక పోవడంపై ఆ వర్గం నేతల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైపు తొంగిచూసే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోక ప్రవీణ్‌రెడ్డి పార్టీని వీడతారన్న ప్రచారం కూడా జోరుగా సాగుతుంది.

ఎంపీని సంప్రదించకుండానే..

జిల్లా పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావును సంప్రదించకుండానే పార్టీ అధ్యక్షుని నియామకం జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. ఆయన సూచించిన వారిని కాదని మరొకరికి పదవి బాధ్యతలను అప్పగించడంపై అధిష్ఠానం తీరుపై అసమ్మతి కనిపిస్తోంది ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ సూచించిన నేతకే జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించారన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. పతంగే బ్రహ్మానంద్‌కు ముందు నుంచి పాయల శంకర్‌తో సన్నిహిత సంబంధాలే ఉన్నాయి. దీంతో ఆయన మద్దతు పలకడంతో పదవి దక్కిందన్న టాక్ పార్టీలో వినిపిస్తోంది. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో జరిగిన పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశంలోనూ ఎంపీ సోయం బాపురావు కొంత మంది నేతల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా ముందు నుంచి జిల్లా పార్టీలో రెండు, మూడు వర్గాలుగా వీడిపోయి నేతలు పని చేస్తున్నారు. ముఖ్యంగా ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ వర్గాలు ఎవరికి వారే పార్టీ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. గత కొద్ది రోజులుగా పార్టీలో ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసుకోవడం పరిపాటిగానే మారింది. దీంతో ముఖ్యనేతలు తమ అనుచరులకే పార్టీ పదవులు దక్కేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్ఠానం చర్యలు చేపడుతున్న జిల్లా స్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. పైపైకి బాగానే కనిపిస్తున్న ముఖ్యనేతలు, కొంత మంది సీనియర్లు ఒకరిపై ఒకరు లోలోన రగిలిపోతున్నట్లు పార్టీలో బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



జిల్లాకేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం

ముస్తాబైన అమరవీరుల స్తూపం

- కొనసాగుతున్న సభా వేదిక పనులు
- ముమ్మరంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు
- రేపు ఇంద్రవెల్లికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

ఇంద్రవెల్లి, జనవరి 31: ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయానికి, అమరవీరుల స్తూపానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానుండటంతో అమరవీరుల స్తూపానికి అధికారులు రంగులు వేశారు. అదేవిధంగా స్తూపం వెనుక స్థలంలో సభా వేదిక ఏర్పాటు పనులను ముమ్మరం చేశారు. గురువారం సాయంత్రంలోపు సభా వేదిక పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానుండటంతో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలాం ఆదేశాల మేరకు పోలీసులు కేస్లాపూర్ నుంచి ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపంతో పాటు పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, బామ్ స్క్వాడ్‌ల ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపుల తనిఖీలు నిర్వహిస్తున్నారు.



రహదారి వెంబడి తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

'ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలి'

ఉట్నూర్, జనవరి 31: గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీల సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని, ఇంద్రవెల్లికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని కల్పించాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భీముడు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు, ఉట్నూర్ ప్రెసిడెంట్ రమణ, వెంకటేశ్, ఉమేశ్, శంకర్, జైశ్వాల్, రాజన్న, సుదర్శన్, సుధాకర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మంత్రి ఆధ్వర్యంలో పార్టీలో చేరిక

బోథ్, జనవరి 31 పంచాయితీ రాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమక్షంలో మండలంలోని సోనాల గ్రామానికి చెందిన సహకార సంఘం డైరెక్టర్‌లలో పోశెట్టి బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క వారికి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఏఐసీసీ విచార విభాగ్ తెలంగాణ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, సోనాల మండల అధ్యక్షుడు గుడాల శేఖర్‌తో పాటు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఎంఎస్‌పీ కార్యకలాపాలు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 31: సీసీఐ సెంట్రల్ నోడల్ ఏజెన్సీగా ప్రస్తుత పత్తి సీజన్‌లో పత్తిలో ఎంఎస్‌పీ కార్యాకలాపాలను చేపట్టినట్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ బ్రాంచ్ ఆఫీస్ ఆదిలాబాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలోని కొనుగోలు కేంద్రం, ఎంఎస్‌పీ రేట్లు తదితర వాటి గురించి మరింత వివరాలకు, రైతులు సీసీఐ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చని అన్నారు. లేదా కోట్-అల్లీ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జనవరి 31 2024 తర్వాత పత్తి కొనుగోళ్లను సీసీఐ నిలిపి వేయడం జరుగుతుందని తప్పుడు వదంతులు ప్రచారం చేస్తున్నారని సీసీఐ దృష్టికి వచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని సీసీఐ పత్తి రైతులందరికీ ఎంఎస్‌పీ కింద నాణ్యమైన గ్రేడ్ పత్తి సేకరణను కొనసాగిస్తుందని, రైతులు తమ పత్తిని సీసీఐకి విక్రయించడంలో భయపడాల్సిన అవసరం లేదని సీసీఐ అధికారులు స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

భీంపూర్, జనవరి 31: మండల కేంద్రం భీంపూర్‌లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సర్పంచ్ మడావి లింబజీ, ఉప సర్పంచ్ రవీందర్ జాదవ్, ఎంపీటీసీ అన్నపూర్ణలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాయినందా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రియ, సుజాత, గ్రామ పెద్దలు సీడం పురుషోత్తం, రాథోడ్ ఉత్తం, పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే అనిల్‌కు మాజీమంత్రి అల్లోల పరామర్శ

నేరడిగొండ, జనవరి 31: మండలంలోని రాజుర గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవలే రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే అనిల్ చిన్ననాన్న కొడుకు జాదవ్ అంబారావు ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు బోథ్ నియోజకవర్గ వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలున్నారు.

సీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలి

- అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పర్యటన ఇంద్రవెల్లిలోనే..
- వెనుకబడిన ఉమ్మడి జిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం
- ఆదివాసీ అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటాం
- రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి, జనవరి 31: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 2న ఉద్యమాల గడ్డ ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభకు వేలాదిగా జనం తరలివచ్చి విజయవంతం చేయాలని పంచాయితీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్త, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంలతో కలిసి కేస్లాపూర్ నాగోబా ఆలయానికి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. నాగోబా దర్బార్ హాల్‌లో సీఎం పర్యటనపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నాగోబా ఆలయంలో దర్శించుకుని నాగోబా దర్బార్ హాల్‌లో సుమారు 400మంది స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులతో ముఖాముఖీ సమావేశం కానున్నారని తెలిపారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆ తరహాలో కేస్లాపూర్ నాగోబా ఆలయంతో పాటు దర్బార్ హాల్‌లో ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అక్కడి నుంచి అమరవీరుల స్తూపానికి సందర్శించి నివాళులర్పించారు. సభ ఏర్పాట్లను పరిశీలించారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన ఆదివాసీ అమరుల జ్ఞాపకార్థంగా రూ.కోటితో స్మృతివనం ఏర్పాటు చేయడం జరుగుతుందని స్మృతి వనం శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి పర్యటన ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం నుంచి ప్రారంభించడం జరుగుతుంద న్నారు. వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక అభిమానం ఉందని, అన్నివిధాలుగా వెనుకబడిన జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధికి ముందుడుగు ఇక్కడి నుంచే బాటలు పడుతాయని అన్నారు. రేవంత్‌రెడ్డి మొదటి సభ, భట్టి విక్రమార్క పాదయాత్ర ఈ జిల్లా నుండే ప్రారంభించారన్నారు. అందుకే అధికారంలోకి వచ్చాక మొదటి సభ ఇంద్రవెల్లిలోనే నిర్వహించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ కట్టిన కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రొఫెసర్ కోదండరాంను వాడుకున్నారని, ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా కుట్రలు పన్నుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ కాదని, కల్వకుంట కుటుంబ పార్టీ అని ఆరోపించారు. ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో నిర్వహించే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్‌డీవో పీడీ కిషన్, జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్, ఉట్నూర్ ఆర్‌డీవో జీవకర్ రెడ్డి, డీఎల్పీవో బిక్షపతిగౌడ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, మెస్రం వంశం ఉద్యోగులు, మనోహర్, శేఖర్‌బాబు, సోనేరావు, మండల అధికారులు, తదితరులు ఉన్నారు.



కేస్లాపూర్‌లో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క



నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి సీతక్క



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తూ..



సీఎం పర్యటనపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తూ..

పని చేసేవారికే పార్టీలో ప్రత్యేక గుర్తింపు : సీతక్క

ఆదిలాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో జోకేవాళ్లకు ప్రాధాన్యత ఉండదని, అంకితభావంతో పనిచేసే వారికే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇంద్రవెల్లిలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న సీఎం బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి సభకు పార్టీ శ్రేణులు భారీగా కదలి రావాలని పిలుపునిచ్చారు. లక్ష మందితో ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా అన్నిస్థానాలను గెలిచే విధంగా పని చేయాలన్నారు. గతంలో ఇంద్రవెల్లిలో నిర్వహించిన బహిరంగ సభ సక్సెస్ కావడం.. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి కలిసి వచ్చిందన్నారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకెంతో అభిమానమని, జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా తనకు బాధ్యతలు అప్పగించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా నిలవాల్సిన అవసరం, బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ న్యాయ్ యాత్రను అడ్డుకునేందుకు దుండగులు ప్రయత్నిస్తున్నారన్నారు. రాహుల్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదని, అధికారంలోకి వచ్చి రెండు, మూడు నెలలకే విమర్శలు చేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నియోజకవర్గ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో నిర్వహించే సీఎం సభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పదేళ్ల అధికారంలో ఉన్న కేటీఆర్‌కు ఆటోవాళ్లు ఇప్పుడు గుర్తొచ్చారా? అని, కనీసం మహిళల సంక్షేమం పట్టించుకోలేరని విమర్శించారు. 100రోజుల అధికారంలోనే పల్లెల్లో నిధులు వస్తున్నాయని, అభివృద్ధి కనిపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, జడ్పీటీసీ గణేష్ రెడ్డి, మల్లెపూల నర్సయ్య, నాయకులు నరేషఖ్ జాధవ్, నారాయణ రెడ్డి, చంటి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని వంద గ్రామాల్లో హెచ్ఐవీ కేసులు : సరిత

ఉట్నూర్, జనవరి 31: జిల్లాలోని వంద గ్రామాల్లో హెచ్ఐవీ కేసులు ఉన్నాయని వైఆర్‌జీకేర్ జిల్లా రిసోర్స్‌పర్సన్ ఇన్‌చార్జి సరితా అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక ప్రజల కోసం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మండలంలోని పెరకగూడ లక్కారం దంతనపల్లి కొత్తగూడ ఉట్నూర్‌లలో హెచ్ఐవీ కేసులు ఉన్నాయని అన్నారు. 18నుంచి 35ఏళ్ల లోపు వారు అధికంగా హెచ్ఐవీ భారీన పడుతున్నారని అన్నారు. హెచ్ఐవీ ఉన్నప్పటికి కొందరు గుట్టుగా పెళ్ళిల్లు చేసుకుంటున్నారని, హెచ్ఐవీని తగ్గించుకుని ఆ తర్వాత పెళ్లి చేసుకుంటే బాగుంటుందన్నారు. భార్యతో కాకుండా అపరిచితులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవడం ద్వారా హెచ్ఐవీ భారీన పడుతున్నారని అన్నారు. హెచ్ఐవీ ఉన్న తల్లుల నుంచి పిల్లలకు కూడా వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. హెచ్ఐవీ ఉన్న వారు క్రమం తప్పకుండా మాత్రలు తీసుకోవాలని అన్నారు. హెచ్ఐవీ సోకిన వారు మానసిక ఆందోళనలకు గురికావొద్దని వైద్యం అందుకుంటున్న ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలని అన్నారు. హెచ్ఐవీ సోకిన వారు ఎవరైనా మిత్రులు ఉంటే వారికి స్నేహితులు కూడా బతుకుపై భరోసా ఇవ్వాలని వారిని ఎగతాళి చేయవద్దని సూచించారు. బాధిత కుటుంబాలను కౌన్సెలింగ్ చేస్తున్నామని, హెచ్ఐవీ లేని వారికి కూడా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. క్షయ వ్యాధికి కూడా సక్రమంగా వైద్యం అందుకుంటే ఆరు మాసాలలోనే తగ్గుతుందన్నారు. తమ సంస్థ ద్వారా ఉట్నూర్ మండలానికి లింక్ వర్కర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఉట్నూర్ మండలంలో 900 మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి కన్నాజి మహేష్‌కుమార్, పంచాయతీ ఈవో శంకర్, లింక్ వర్కర్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఆర్‌జీకేర్ జిల్లా రిసోర్స్‌పర్సన్ ఇన్‌చార్జి సరితా



ముథోల్, జనవరి 31 : మండలంలోని చించాల గ్రామంలోని హనుమాన్ ఆలయంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహంలో భాగంగా

భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర

● నేడు చించాలలో జాతర

బుధవారం భక్తులు ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. నారాయణ మహారాజ్ యాతల్‌కర్ నేతృత్వంలో ప్రత్యేక వాహనంలో భక్త తుకారం మహారాజ్, విట్టల రుక్మాయి దేవుళ్ల చిత్రపటాలతో శోభాయాత్రలో భజన భక్త మండలి కీర్తనలు చేస్తూ దిండి కార్యక్రమం చేపట్టారు. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. గురువారం సప్తాహం ముగింపు సందర్భంగా జాతర జరుగనుంది.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సుధాకర్

ఖానాపూర్, జనవరి 31 : ఖానాపూర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వై. సుధాకర్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. కాగా వీరిలో వై. సుధాకర్ అత్యధిక ఓట్లు సాధించడంతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన తెలిపారు.

నేడు సాయిబాబా జాతర కొబ్బరికాయల వేలం

ఖానాపూర్, జనవరి 31 : మండల కేంద్రంలోని వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకల్లో కొబ్బరికాయలు, లడ్డు ప్రసాదం విక్రయించేందుకు గురువారం టెండర్ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా టెండర్లలో పాల్గొనేవారు ఉదయం 10 గంటలకు సాయిబాబా ఆలయం వద్దకు హాజరు కావాలని సూచించారు. టెండర్ ప్రక్రియ అనంతరం ఆలయ 27వ వార్షికోత్సవం సాయిబాబా జాతర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ల విడుదల కార్యక్రమం ఉంటుందన్నారు. ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ సాయిబాబా భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, జనవరి 31 : మోటార్ సైకిల్ వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని తద్వారా రోడ్డు ప్రమాదాల నుండి ప్రాణాలు రక్షించుకోవచ్చునని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. నిర్మల్ మండలం అక్కాపూర్ గ్రామంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం 11 సీసీ కెమెరాలు ప్రారంభించారు. హెల్మెట్‌ధారణపై అక్కడి పాఠశాల విద్యార్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హెల్మెట్ ధారణ శాసనం కాదని, ప్రజల సంక్షేమమే అన్నారు. ప్రాణాలు కాపాడే ఆయుధం హెల్మెట్ అన్న సంగతి గ్రహించాలన్నారు. లయన్స్ క్లబ్ సమకూర్చిన హెల్మెట్‌లను ఎస్పీ యువతకు అందజేశారు. సీసీ కెమెరాల ఆవశ్యకత వివరిస్తూ ఒక్క సీసీ కెమెరా వంద మంది నేత్రాలతో సమాన మన్నారు. నేరం జరిగినప్పుడు సీసీ కెమెరాలు నిందితులను గుర్తించేందుకు కీలక పాత్ర వహిస్తాయన్నారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఎంవీఐ అజయ్ కుమార్ రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్ర భూషణ్, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి



లక్ష్మణచాందలో గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, జనవరి 31 : తెలంగాణ రాష్ట్రంలో ప్రజా యుద్ధనౌకగా పేరు గాంచిన గద్దర్ అలియాస్ గుమ్మడి విఠల్‌రావు జయంతిని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతులను వెలిగించారు. ప్రజాచైతన్యం కోసం అంకితమైన ఆయన జీవన ఘట్టాలపై న్యాయవాది ఎన్‌టీ రాజేశ్వర్ ప్రసంగించారు. తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ వి. గంగాధర్, సర్పంచ్‌లు సురకంటి ముత్యంరెడ్డి, కొమ్ము శ్రీవిద్య, ఎం.లక్ష్మి, రాజమణి ప్రభాకర్, కమల్‌కోట పద్మ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ గడ్డం వెంకట్ రెడ్డి, నాయకులు అడ్వాల రమేష్, వెంకట్‌రెడ్డి, రాములు, మోహిన్, జీవన్‌రెడ్డి, బి. పోశెట్టి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయండి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్

ఖానాపూర్, జనవరి 31 : పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లిలో రేపు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి నియోజకవర్గానికి వస్తున్నందున ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గ నలుమూలల నుండి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ఖానాపూర్ మండలం నుండి సుమారు పదివేల వరకు జనాన్ని సీఎం సభకు తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖానాపూర్ నియోజకవర్గం నుంచి తన పార్లమెంట్ ఎన్నికల ప్రచార సమర శంఖారావాన్ని పూరించనున్నట్లు దయానంద్ తెలిపారు. తన పర్యటనలను ముఖ్యమంత్రి ఖానాపూర్ నియోజకవర్గంలోని ఇంద్రవెల్లి నుంచి ప్రారంభించడం చూస్తే నియోజకవర్గంపై ఆయనకున్న అభిమానం తెలిసిపోతుందన్నారు. రాబోయే రోజుల్లో ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని విధాల అండగా ఉంటారన్నారు. నియోజకవర్గంపై అమితమైన అభిమానాన్ని కలిగి ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి సభకు భారీగా తరలివెళ్లి ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజుర సత్యం, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు యూసఫ్ ఖాన్, జిల్లా నాయకులు అమానుల్లా ఖాన్, జంగిలి శంకర్, పరంకుశ శ్రీనివాస్, ఎల్ములశోభన్ బాబు, రఘుపతి రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి సభకు భారీగా జన సమీకరణ

భైంసా, జనవరి 31 : ముఖ్యమంత్రి హోదాలో శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇంద్రవెల్లిలో తొలిసారిగా పర్యటించనున్న రేవంత్‌రెడ్డి పర్యటన విజయవంతం చేసేందుకు గాను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముమ్మర కసరత్తులు చేపట్టాయి. ముథోల్ నియోజకవర్గ పరిధి నుంచి ఇంద్రవెల్లిలో జరుగనున్న సభకు అధికమొత్తంలో జనాన్ని తరలించేందుకు గాను ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగానే బుధవారం కార్యక్రమ జిల్లా పరిశీలకులు, డీసీసీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి భైంసాలో పర్యటించి మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ ఆధ్వర్యంలో ముథోల్ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జన సమీకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారిగా నిర్వహిస్తున్న పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కార్యక్రమ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నియోజక వర్గ పరిధిలోని ప్రతి గ్రామం నుంచి జనసేకరణ, ఇంద్రవెల్లికి తరలింపు తదితర అంశాలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. 400కు పైగా వాహనాలలో 5 వేలకు పైగా జనాలను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు.

● బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

ముథోల్ నియోజక వర్గ పరిధిలో బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం తానూర్ మండలంలోని బొంద్రట్ గ్రామ సర్పంచ్ మందాకినికేశవ్, మహాలింగి సర్పంచ్ రత్నాబాయిపోశెట్టి, బెల్‌తరోడా గ్రామానికి భారత జాగృతి సమితి జిల్లా ప్రతినిధి అట్టల్ దేవిదాస్‌లు తమ తమ అనుచరగణంతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరారు. భైంసాలో జరిగిన కార్యక్రమంలో వీరందరూ ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ సమక్షంలో బీఆర్ఎస్‌ను వీడి హస్తం నీడకు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పాటిల్ చేరిన వారందరికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

16న పారిశ్రామిక, గ్రామీణబంద్‌ను జయప్రదం చేయండి

నిర్మల్ టౌన్, జనవరి 31 : ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని జాయింట్ ప్లాట్ ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారతస్థాయిలో నిర్ణయించామని నిర్మల్ జిల్లా కార్మికుల సమ్మె గ్రామీణ బందును జయప్రదం చేయాలని, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో గల సోఫీనగర్ బీడీ ఫ్యాక్టరీలో, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఎఫ్‌టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇచ్చారు.

దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొనాలి : సీఐటీయూ

నిర్మల్ కల్చరల్ : 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొనాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. సోన్ మండల కేంద్రంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి

దిలావర్‌పూర్, జనవరి 31 : ఐసీడీఎస్ బలోపేతం చేయడం ద్వారా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు డి. పోశెట్టి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన అంగన్ వాడీల సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, గోదావరి, అరుణ, లక్ష్మి, హెల్పర్లు పాల్గొన్నారు.

'బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం'

ఖానాపూర్, జనవరి 31 : బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు కే. శేఖర్, నాగరాజు, పోశెట్టి, స్వామి, గజ్జల రవి, పల్లెర్ల లక్ష్మణ్, ప్రసాద్, వనజ, తదితరులున్నారు.

శివశంకర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

ముథోల్, జనవరి 31 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో బుధవారం బడుగు బలహీన వర్గాలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాజీ కేంద్ర న్యాయశాఖ మంత్రి, గవర్నర్ జస్టిస్ పుంజాల శివశంకర్ విగ్రహ ఏర్పాటుకై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేందర్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. భూమిపూజ కార్యక్రమంలో టీఎంకేఈఏ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇటిక్యాల వెంకట కిషన్, టీఎంకేఈఏ నిర్మల్ జిల్లా అధ్యక్షులు గంగాధర్, కార్యదర్శి బారే శ్రీనివాస్, రీసెర్చ్ స్కాలర్ సిహెచ్. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఖానాపూర్‌లో నిరసన

ఖానాపూర్, జనవరి 31 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ కోదండరాం పాత్ర ఏంటో యావత్ తెలంగాణ ప్రజానీకానికి తెలుసని టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కడపత్రి తిలక్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా టీజేఎస్ ఆధ్వర్యంలో నోటికి నల్లగుడ్డలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిలక్‌రావు మాట్లాడుతూ... ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారాన్ని హైకోర్టులో బీఆర్ఎస్ అడ్డుకోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కోదండరాంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. దాసోజు శ్రావణ్ ఏ ఉద్యమంలో పాల్గొన్నారో బహిరంగ చర్చకు రావాలన్నారు. ఉద్యమ శిఖరమైన కోదండరాంను కించపరిస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కమలాకర్, రైతు విభాగం జిల్లా నాయ కులు రాజేశ్వర్ రెడ్డి, పన్నాల లింగన్న తదితరులున్నారు.

బీఆర్ఎస్ రాజకీయాలతోనే నిలిచిన కోదండరాం ప్రమాణ స్వీకారం

● టీజేఎస్ ముథోల్ ప్రతినిధుల ఆరోపణ ● మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



భైంసాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీజేఎస్ ప్రతినిధులు

భైంసా, జనవరి 31 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలతో చీత్కారం ఎదుర్కొన్న బీఆర్ఎస్ ఇంకా నీచ రాజకీయాలను వదిలి పెట్టడం లేదని టీజేఎస్ ముథోల్ నియోజకవర్గ ప్రతినిధులు తులసీరామ్, అలీమ్‌ఖాన్‌లు ఆరోపించారు. ఎమ్మెల్సీగా కోదండరాం ప్రమాణ స్వీకారం నిలిచిపోవడాన్ని నిరసిస్తూ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం భైంసాలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఘోర పరభావాన్ని చవి చూసిన బీఆర్ఎస్ తీరు మారకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్రపూరిత విధానాలతోనే కోదండరాం ప్రమాణ స్వీకారం నిలిచిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై చట్టసభల్లో కోదండరాం గొంతెత్తి నిలదీస్తాడనే భయాందోళనతోనే ఆ పార్టీ పెద్దలు నీచ రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ చావు దెబ్బ తినడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక విశ్రాంతి భవనం నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మకు ప్రధానరోడ్డు వరకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు.

గిరిజనేతర రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జనవరి 31: మండలంలోని నాగపూర్ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న గిరిజనేతర రైతుల భూమి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని మత్తడిగూడ, నాగపూర్‌లలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. గిరిజనేతర్ల భూమి సమస్య పరిష్కారం కోసం మంత్రి సీతక్కతో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఇందులో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, జడ్పీటీసీ చారులత, వైస్ ఎంపీపీ బాలాజి, సర్పంచ్‌లు మడావి యశోధ, మోతిరాం, జాదవ్ సునీల్‌నాయక్, డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్, ఎంపీవో మహేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రైల్వేలైన్ ఏర్పాటు చేయించాలి'

ఉట్నూర్, జనవరి 31: అభివృద్ధికి దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాలలో రవాణా రంగం అభివృద్ధి చెందడానికి ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ మీదుగా కాగజ్‌నగర్‌కు రైల్వే లైన్ మంజూరు చేయాలని రైల్వేలైన్, యూనివర్సిటీ, సాగునీరు తాగునీరు సమస్యల సాధనకమిటీ ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో సాధన కమిటీ సభ్యులు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోకన్వీనర్ బానోత్ రామారావు మాట్లాడుతూ గతంలో ఉట్నూర్‌కు యూనివర్సిటీ మంజూరు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వాలు ఇతర ప్రాంతాలకు తరలించారని, ఉట్నూర్‌లో అగ్రికల్చర్, వెటర్నరీ, లేదా మెడికల్ యూనివర్సిటీ మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంతంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా ప్రాంతంలో గిరిజన గ్రామాలకు సాగునీరు తాగునీరు అందుబాటులో లేక ప్రజలు కేవలం వర్షాధారంగా పంటలు పండిస్తున్నారని అన్నారు. కొమురంభీం ఆడ ప్రాజెక్టుకు తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఎత్తి పోతల ద్వారా ఆడ ప్రాజెక్టుకు నీరు తరలించి ఏజెన్సీ ప్రాంతాల గ్రామాలకుసాగునీరు అందించేలా ప్రణాళికలు చేయాలన్నారు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చెందేలా ప్రభుత్వాలు కార్యచరణ చేసే వరకు ఉద్యమాన్ని చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో కట్ట లక్ష్మణచారి, మేస్రం కేశవ్‌లున్నారు.

'ప్రభుత్వ వైద్యం అందించేందుకు కృషి'

బోథ్, జనవరి 31: ప్రభుత్వం ప్రజలందరికీ సరైన వైద్యం అందించాలని తగు చర్యలు తీసుకుంటున్నదని లోకల్ బాడీ కలెక్టర్ వికాస్ మహాతో పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పొచ్చెర గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని మాల సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సరైన వైద్యం అందించాలని దృక్పథంతో ఉందన్నారు. గ్రామాలకు సైతం వైద్య సేవలు అందాలంటే ఆరోగ్య కేంద్రాల అవసరమని, అందులో భాగంగానే ఈ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. దీంతో ప్రజలకు ప్రాథమిక వైద్యం అంతే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, బాలాజీ పటేల్, సంజీవ్, చంద్రశేఖర్, ప్రవీణ్ రెడ్డి, కే బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

'వివాదాస్పద టీచర్లను బదిలీ చేయాలి'

ఉట్నూర్, జనవరి 31: మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వివాదస్పద ఉపాధ్యాయులు శామ్యూల్, వీరయ్యలను వెంటనే బదిలీ చేయాలని లేనట్లయితే ఆందోళన చేస్తామని లక్కారం గ్రామస్థులు అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్రం తిరుపతి, నీలాబాయి, అన్నపూర్ణ, తొగరిరఘు, కాల్వరవి తదితరులు మాట్లాడుతూ ఇటీవల ఉన్నత పాఠశాల నూతన భవనానికి పాత పాఠశాల నుంచి విద్యార్థులతో సామాగ్రిని మోపిస్తూ ఉన్న ఉపాధ్యాయులను గ్రామస్థుడు రాకేష్ ప్రశ్నించగా ఆయనపై ఉపాధ్యాయుడు శామ్యూల్ దాడి చేశారని, దీంతో రాకేష్ సైతం ఉపాధ్యాయుడు పైచేయి చేసుకున్నాడని అన్నారు. ఇదే అదునుగా సదరు ఉపాధ్యాయుడు రాకేష్‌పై ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేసి కులం పేరుతో దూషించాడని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని అన్నారు. ఈ వివాదాస్పద ఉపాధ్యాయులను బదిలీ చేయాలని కలెక్టర్‌కు, డీఈవోకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయమై ఉపాధ్యాయుడు శామ్యూల్‌ను వివరణ కోరగా అన్ని అసత్య ఆరోపణలు అని, ఏదైనా అనుమానం ఉంటే పాఠశాల హెచ్‌ఎంను అడగాలి.. కానీ తనను బాధ్యున్ని చేయడం సరైనదా? అని అన్నారు.

కొమురం భీం అందరికీ ఆదర్శం

● బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

భీంపూర్, జనవరి 31: ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన కొమురం భీం అందరికీ ఆదర్శం అని మాజీ మంత్రి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న గుర్తు చేశాడు. భీంపూర్ మండలం అర్లీ(టి)లో బుధవారం ఆయన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీ గోడేం నగేష్‌లతో కలిసి కొమురం భీం విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ విగ్రహానికి పూల మాలలు సమర్పించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ యువ నాయకుడు గొల్లి వైభవ్, సల్మాన్‌ల స్మారకార్థం సర్పంచ్ గొల్లి రామ భాయి లస్మన్న దంపతులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ సత్తా చాటనుందన్నారు. ప్రతీ గ్రామం బీఆర్ఎస్ హాయంలోనే అభివృద్ధి చెందిందని మాజీ ఎంపీ నగేష్ అన్నారు. నియోజవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కరాంజి గుబ్‌డి రోడ్డు నిర్మించి తీరుతాం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పిప్పల కోటీ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బడికి ప్రహరీ గోడ మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు కుమ్రా సుధాకర్, రాజు, ఎంపీపీ కుడి మేత రత్నప్రభ సంతోష్, ఎంఈవో శ్రీకాంత్, కన్వీనర్ మేకల నాగయ్య, అనిల్ జాదవ్ యువసేన అధ్యక్షుడు షేక్ ఆఫ్రోజ్, వడూర్ ఎంపీటీసీ తూటి బోజన్న, సర్పంచులు కల్యాణి గంగయ్య, హనుమన్ దాస్, నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'నియామక పత్రాలను అందజేయాలి'

తలమడుగు, జనవరి 31: 60 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులకు నియామక పత్రాలు అందేసి ఉద్యోగ అవకాశం కల్పించాలని బుధవారం తహసీల్దార్ రాజమోహన్‌కు వీఆర్ఏ వారసులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో రెవెన్యూ శాఖల విధులు నిర్వహించినప్పటికీ కొంతమందికి అర్హత ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించినప్పటికి చదువు లేక 60సంత్సరాల పైబడి వారి కుటుంబసభ్యులకు వారసులకు ప్రభుత్వ జీవన ప్రకారం నియామక పత్రాలు అందజేసి వారిని ఆదుకోవాలని వారు కోరారు. అదేవిధంగా గత ఆరు నెలలకు విధులు నిర్వహిస్తున్నప్పటికి జీతాలు అందక పోవడంతో ఆర్థికంగా మానసికంగా నష్టపోతున్నామన్నారు. తలమడుగు మండలంలో 9మంది వీఆర్ఏ వారసులు ఉన్నారని, వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వారు కోరారు. ఇందులో నారాయణ, సత్యనారాయణ, గంగన్న, సంతోష్, వెంకన్న, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల సమస్యలను పట్టించుకోలేదు'

తలమడుగు, జనవరి 31: గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల గ్రామ సమస్యలు పట్టించుకోక పోవడంతోనే అభివృద్ధికి వెనుకబడ్డారని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సకినాపూర్ గ్రామంలో ఎమ్మెల్సీ నిధుల ద్వారా నిర్మించిన షెడ్డును అయిన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయాంలో ప్రతీఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలను అందిస్తామన్నారు. అదే విధంగా గ్రామంలో సీసీ రోడ్లు మురికి కాలువలు, రైతుల పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సకినాపూర్ గ్రామంలో రూ.5 లక్షలతో ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూరైన ఎస్టీ కమ్యూనిటీ షెడ్ పని పూర్తికావడంతో షెడ్‌ను ప్రారంభించి, స్థానిక సర్పంచ్ మారుతి పదవి కాలం ముగియడంతో సన్మానించి వీడ్కోలు పలికిన జడ్పీటీసీ, ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్‌తో పాటు ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీ వెంకన్న, నారాయణ, సంతోష్, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రతాప్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం

బజార్‌హత్నూర్, జనవరి31: మండలం పరిధిలోని బలన్‌పూర్ గ్రామానికి చెందిన నిండు గర్భిణి గంగాదేవికి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించారు. దీంతో వెంటనే సిబ్బంది వాహనంలో ఆదిలాబాదులోని రిమ్స్‌కు తరలించారు. కాగా, మార్గమధ్యలో గుడిహత్నూర్ సమీపంలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. ఇందులో 108 సిబ్బంది ఈఎంటీ సతీష్, నవీన్‌లు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

భారీ జన సమీకరణకు సన్నాహాలు

- ఇంద్రవెల్లి సభకు భారీ జన సమీకరణలో నిమగ్నం
- సత్తా చాటుకునేందుకు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సన్నాహాలు
- ఇప్పటికే జిల్లాలో పార్టీ శ్రేణులతో సమావేశాలు
- మూడు నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు

నిర్మల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ రణభేరి కార్యక్రమానికి జిల్లా నుంచి భారీగా జనాన్ని సమీకరించి తన సత్తాను చాటుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జన సమీకరణ అంశాన్ని కాంగ్రెస్ సవాలుగా తీసుకుంటోంది. మొన్నటి ఎన్నికల్లో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందిన సంగతి తెలిసిందే. అయితే ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ విజయం సాధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో కూడా ఆ పార్టీ గెలుపొందినట్లుగానే భావిస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందినప్పటికి అధికారంలో ఉన్న కారణంగా కాంగ్రెస్ తన ఉనికిని నిలుపుకునే ప్రయత్నాలు చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, ముథోల్‌లో ఆ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన నారాయణరావు పటేల్‌లు ప్రస్తుతం పార్టీకి అన్ని తామై ముందుండి నాయకత్వం వహిస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ప్రచార పర్వాన్ని చేపట్టేందు కోసం ఇంద్రవెల్లిని ఎంపిక చేశారు. దీనికి అనుగుణంగానే ఆయన తన ఎన్నికల శంఖారావాన్ని ఇంద్రవెల్లి నుంచి మొదలుపెట్టనున్నారు. దీని కోసం గానూ ఇంద్రవెల్లిలో భారీఎత్తున బహిరంగసభను నిర్వహించేందుకు తలపెట్టారు. సీఎంగా మొదటిసారిగా ఉమ్మడి జిల్లాలో జరిగే ప్రధాన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నందున ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సీరియస్‌గా తీసుకుంటున్నాయి. నియోజకవర్గాల వారీగా అక్కడి స్థానిక నాయకులకు జన సమీకరణ బాధ్యతలను అప్పగించారు. ముఖ్యంగా జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి జనసమీకరణ బాధ్యతలనంతా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు భుజస్కంధాలపై పార్టీ అధిష్టానం పెట్టింది. దీంతో శ్రీహరిరావు గత వారం రోజుల నుంచి నిర్మల్ నియోజకవర్గంతో పాటు ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ జన సమీకరణకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నారు. ఇంద్రవెల్లి రణభేరికి సంబంధించి ఇన్‌చార్జీగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డితో శ్రీహరిరావు సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్మల్ నియోజకవర్గం నుంచే కాకుండా ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గం నుంచి జనాన్ని ఎక్కువసంఖ్యలో తరలించేందుకు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా ప్రతీ మండలానికి ఓ ఇన్‌చార్జీని నియమించారు. అలాగే జనం తరలింపుకు సంబంధించి అవసరమయ్యే వాహనాలను కూడా పార్టీ ఆధ్వర్యంలోనే సమకూరుస్తున్నారు. ఇంద్రవెల్లి రణభేరి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అత్యంత సీరియస్‌గా తీసుకుంటుండడం, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, సీనియర్ నాయకులంతా హాజరవుతున్న కారణంగా రాజకీయ వర్గాల్లో ఈ కార్యక్రమం చర్చనీయాంశమవుతోంది. జిల్లాలో జరిగిన మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒకే చోట గెలిచినప్పటికి మిగతా చోట్ల కూడా తన అస్థిత్వాన్ని కాపాడుకోగలిగింది. పార్టీ అధికారంలోకి రావడంతో ఇక తన ఉనికిని మరింతగా విస్తరించుకొని పూర్వవైభవం సాధించాలన్న పట్టుదలతో ఉంది. లోక్‌సభ ఎన్నికల వరకు పార్టీని మరింత పటిష్ఠం చేసి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ధీటుగా నిలవాలన్నదే ఆ పార్టీ అధిష్టానం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి అనుగుణంగానే ఇంద్రవెల్లి రణభేరి సభను కాంగ్రెస్ సవాలుగా తీసుకుంది. ముఖ్యంగా మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన నియోజకవర్గాల నుంచి భారీగా జనాన్ని సమీకరించి ప్రధానపార్టీలకు ఇంకా ధీటుగానే ఉన్నామన్న సంకేతాలను పంపేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోందంటున్నారు.

పూర్వ వైభవం దిశగా..

మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందినప్పటికీ ఆ పార్టీ అధికారంలోకి రావడంతో గెలుపొందిన పార్టీలకు ధీటుగా నిలిచేందుకు సిద్ధమవుతోంది. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఓటమి చెందినప్పటికీ ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రం ఆ పార్టీ విజయం సాధించింది. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందగా అప్పటి అధికార బీఆర్‌ఎస్ పార్టీ కూడా ఓటమి పాలైంది. ప్రస్తుతం అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్న కారణంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు జిల్లాకు చెందిన ఆ పార్టీ నేతలంతా వ్యూహరచన సాగిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే తమ పార్టీ ఓటమి చెందిన నియోజకవర్గాల్లో అక్కడి నేతలకే ప్రాధాన్యతనిస్తామంటూ ప్రకటించడమే కాకుండా వారికి సూపర్ పవర్ ఇస్తామంటూ కూడా పరోక్ష సంకేతాలు పంపారు. దీని కారణంగానే ఇటు బీఆర్‌ఎస్, బీజేపీలోని అసంతృప్తి నాయకులు క్రమంగా హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొంత మంది ఆయా పార్టీల సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇలాంటి పరిణామాలన్నింటిని అనుకూలంగా మలుచుకుంటూ ఇంద్రవెల్లిలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని సక్సెస్ చేసి తన ఉనికిని మరింతగా విస్తరించుకోవాలని ఆ పార్టీ పావులు కదుపుతోంది.

శ్రీహరిరావుపైనే కీలక బాధ్యతలు

కాగా ఇంద్రవెల్లిలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డిసభతో పాటు జిల్లాలో పార్టీని మరింత పటిష్ఠం చేసి బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు ధీటుగా తీర్చిదిద్దే బాధ్యతలను ఆపార్టీ అధిష్ఠానం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు భుజస్కంధాలపై పెట్టింది. ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌లతో శ్రీహరిరావు ఇప్పటికే పార్టీ పటిష్ఠతతో పాటు కార్యక్రమాల విస్తరణకు సంబంధించి పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం శ్రీహరిరావుకు పార్టీ విస్తరణ బాధ్యతలను అప్పజెప్పడమే కాకుండా అన్ని తానే చూసుకుంటానంటూ హామీ కూడా ఇచ్చారు. దీంతో శ్రీహరిరావు పలుసార్లు సీనియర్ నేతలతో కూడా చర్చలు జరిపి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల దూకుడుకు చెక్‌పెట్టే వ్యూహాలపై చర్చించారు. ఈ చర్చలకు అనుగుణంగా వీరంతా ఉమ్మడి వ్యూహం అమలు చేస్తూ జిల్లాలో పార్టీని దీటైన రాజకీయ శక్తిగా తిరిగి తీర్చిదిద్దాలని నిర్ణయించారు. మొత్తానికి ఇంద్రవెల్లి రణభేరి సభతో కాంగ్రెస్ పార్టీ జిల్లాలో పూర్వ వైభవం సాధించే దిశగా అడుగులు వేసేందుకు మార్గం నిర్మించుకుంటోందని అంటున్నారు.

2న ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ

- ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- దేశంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలి
- వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- మాజీ ఎమ్మెల్సీ, ఇంద్రవెల్లి సభ ఇన్‌చార్జి అరికెల నర్సారెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 31 : 2వ తేదీన ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగసభను నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, ఇంద్రవెల్లిసభ ఇన్‌చార్జి అరికెల నర్సారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ బహిరంగ సభ ద్వారా పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నట్లు వెల్లడించారు. బుధవారం నిర్మల్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో ఇంద్రవెల్లి సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి బహిరంగసభ ఇంద్రవెల్లిలోనే నిర్వహించారన్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల నిర్బంధాలు పెట్టినా, అవేవీ పట్టించుకోని ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి రేవంత్‌రెడ్డి సభను సక్సెస్ చేశారన్నారు. ఆ సభ ద్వారానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతున్నదని సుస్పష్టమైందన్నారు. మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంద్రవెల్లి సభ ద్వారానే రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్రంలో విజయం సాధించామని, ఇక దేశంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చిత్తశుద్ధితో పని చేయాలని పిలుపునిచ్చారు. ఎక్కడికెళ్లినా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 10 నుంచి 14 స్థానాలను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఆరుగ్యారంటీలే కాకుండా ప్రజల అవసరాలను బట్టి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, నాయకులు అర్జుమన్, జునైద్, సాధ సుదర్శన్, గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, గాజుల రవి, బురాజ్, ప్రతాప్‌రెడ్డి, పూదరి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోలు నిలిపివేత

ముథోల్, జనవరి 31 : జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యందు పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువైనందున భైంసా, కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఫిబ్రవరి 1 నుండి 4వ తేదీ వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపి వేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ మిల్లుల యందు ఫిబ్రవరి 2 నుంచి ఫిబ్రవరి 4 వరకు సీసీఐ వారు పత్తి కొనుగోలు నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇట్టి విషయమై జిల్లాలోని రైతు సోదరులు గమనించి సహకరించగలరని కోరారు. తిరిగి పత్తి కొనుగోళ్లు ఫిబ్రవరి 5వ తేదీ నుండి యధావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

జిల్లాలో 161 స్టాఫ్‌నర్సుల నియామకం

- ఆసుపత్రుల్లో మెరుగుకానున్న వైద్య సేవలు



హైదరాబాద్‌కు తరలుతున్న నియమితులైన స్టాఫ్ నర్సులు

భైంసా, జనవరి 31 : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించేందుకు గాను నూతనంగా 161 మంది స్టాఫ్ నర్సుల నియామకం జరిగింది. టీఎస్‌పీఎస్‌సీ ద్వారా నిర్వహించిన రాతపరీక్షలో అర్హత సాధించి ఎంపికైన వారికి స్టాఫ్ నర్సులుగా నియమించారు. రెండు రోజుల క్రితమే స్టాఫ్ నర్సులుగా నియమితులైన వారి జాబితా విడుదలయ్యింది. వీరందరూ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామకపు ఆర్డర్ కాపీలు స్వీకరించేందుగాను హైదరాబాద్ తరలివెళ్లారు. జిల్లాలో 161 మంది స్టాఫ్ నర్సులుగా ఎంపికవ్వగా వారిలో 93 మంది నిర్మల్ డివిజన్ పరిధిలో మిగతా 61 మంది భైంసా డివిజన్ పరిధిలో విధులు నిర్వహించనున్నారు. స్టాఫ్ నర్సుల కొరత ఉండటం మూలంగా వివిధ ప్రభుత్వ ఆసుపత్రులో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందాయి. రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయడం మూలంగా వైద్యసేవలు మెరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం భైంసా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ఇద్రిస్ గౌరి ఆధ్వర్యంలో ఇక్కడి డివిజన్ పరిధిలోని స్టాఫ్‌నర్సులుగా నియమితులైన స్టాఫ్‌నర్సులు ఆర్డర్ కాపీలు తెచ్చుకునేందుకు గాను రెండు బస్సులలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

నియామక ఉత్తర్వులు అందుకున్న సిబ్బంది

నిర్మల్ కల్చరల్, జనవరి 31 : జిల్లా నుంచి 161 మంది నర్సింగ్ ఆఫీసర్లుగా బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నియామకపు ఉత్తర్వులు అందుకున్నట్లు వైద్యాధికారి ధనరాజ్ తెలిపారు. కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ ఈ ఉత్తర్వులు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి రాజేందర్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి డీఎస్పీ సన్మానం



వైద్యసిబ్బందిని సన్మానిస్తున్న డీఎస్పీ

నిర్మల్ కల్చరల్, జనవరి 31 : ఇటీవల కత్తిపోట్లకు గురై ప్రాణాపాయ స్థితిలో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన బాధితుడు వెంకటేష్‌కు శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టిన ప్రభుత్వ వైద్యులు, సిబ్బందిని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి బుధవారం సన్మానించారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ వైద్యులు శస్త్ర చికిత్స చేసి ప్రణాలు నిలబెట్టడం ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కల్పించారని ప్రశంసించారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. బోధనాసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ సునీల్, వైద్యులు గణేష్, రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం

నిర్మల్ కల్చరల్, జనవరి 31 : మున్సిపాలిటీలో పని చేస్తున్న శ్రీనివాస్, శివమ్మ, పోసాని, బి. రాజమణి, సుశీల, దీకొండ నర్సు, శేఖర్ ఉత్తమ కార్మికులుగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆ సంఘం సన్మానించింది. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కిషన్ కుమార్ మాట్లాడుతూ... 11 పీఆర్సీ ప్రకారం జీవో 60 అనుసరించి చెల్లించాలన్నారు. పారిశుధ్య సేవల ప్రైవేటీకరణ ఉపసంహరించాలని, ప్రమాదాల్లో మరణించిన వారికి రూ.25 లక్షల చెల్లింపు, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోశెట్టి, సుజాత, రాజమణి, శైలజ, అతిక్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నివేదికలతో హాజరుకావాలి

- రేపు ఓటరు జాబితా పరిశీలకుల రాక
- జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా సమావేశం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, జనవరి 31 : ఓటరు జాబితా సవరణ 2024 ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా నియమితులైన ప్రత్యేక కార్యదర్శి బి. భారతి లక్పత్ నాయక్ శుక్రవారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశానికి నిర్మల్, ఆదిలాబాద్, కొమురం భీం, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు. అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు. మండలాల వారీగా ఓటరు మార్పు చేర్పులపై నివేదికలు మండల స్థాయి అధికారులు, బీఎల్‌వోలు గురువారంలోగా పూర్తి నివేదికలు అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం ఆయన నియోజకవర్గ రిట్నరింగ్ అధికారులు, తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు మొదటి విడత తనిఖీ 5 నుండి చేపట్టాలన్నారు. గూగుల్ మీటింగ్‌కు హాజరైన కలెక్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఒక్కరికే ఆరు మండలాలు అప్పజెప్పితే పని ఎలా జరిగేది ?

- సర్వసభ్య సమావేశం నుంచి డీఈవోకు ఫోన్ చేసి అడిగిన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



లంగ్డాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

లక్ష్మణచాంద, జనవరి 31 : ఒకే వ్యక్తికి ఆరు మండలాల బాధ్యతలు అప్పజెప్పితే పని ఎలా జరుగుతుందని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రశ్నించారు. ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ అధ్యక్షతన మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన ఎజెండా అంశాలవారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్య అనే ఎజెండా అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ఎంఈవో మధుసూదన్ వివరాలు వెల్లడిస్తుండగా మండలంలోని పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలపై వివరాలు అడుగగా ఆయన తడబడ్డారు. దీంతో అసహనానికి గురైన మహేశ్వర్‌రెడ్డి వెంటనే డీఈవో రవీందర్‌రెడ్డికి ఫోన్‌చేసి పై విధంగా స్పందించారు. ఆ తరువాత ప్రతి ఎజెండా అంశాన్ని లోతుగా సమీక్ష చేశారు. మిషన్ భగీరథ నీటిని ప్రజలు తాగటం లేదని అందుకు గల కారణాలు తెలుసుకుని ప్రజలు ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. తొలిసారి సర్వసభ్య సమావేశానికి వచ్చిన మహేశ్వర్ రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, డిప్యూటీ తహ సీల్దార్ వి. గంగాధర్, ఎంపీవో నసీరుద్దీన్, తదితరులు ఉన్నారు.

గైర్హాజరైన బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు

బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు పడిగెల అనిత, తిప్పని రాజేశ్వర్, గడ్డం నర్సారెడ్డిలు మాత్రమే హాజరయ్యారు. అలాగే సర్పంచ్‌లు కొమ్ము శ్రీవిద్య, కమల్‌కోట పద్మ, అట్ల లలిత, కొప్పెల్లి రాజమణి, మాదాస్తు లక్ష్మి, సురకంటి ముత్యం రెడ్డి, అడిచెర్ల రవి కుమార్‌లు మాత్రమే హాజరయ్యారు. బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు గాని, సర్పంచ్‌లు గాని సమావేశానికి హాజరుకాలేదు.

సాదాసీదాగా సోన్ సర్వసభ్య సమావేశం

నిర్మల్ రూరల్ : మండల కేంద్రమైన సోన్‌లోని రైతువేదికలో బుధవారం ఎంపీపీ బర్ల మానస అధ్యక్షతనలో జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు నివేదిక చదివి వినిపించారు. అధికారులకు ఎమ్మెల్యే గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులందరూ సమిష్టిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారుల దృష్టికి సమస్యలు వచ్చిన వెంటనే క్షేత్ర స్థాయిలో వెళ్లి వీలైనంత తొందరలో సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, మత్స్యశాఖ, విద్యుత్, ఆర్టీసీతో పాటు పలు శాఖల అధికారులు తమ నివేదికను చదివి వినిపించారు. అంతకుముందు మండలంలోని పలు మంజూరైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని లంగ్డాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, గ్రామాల్లో నిర్మిస్తున్న రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాలు, స్ట్రీట్ లైట్స్ ఇలా ప్రతి కార్యక్రమం కేంద్ర నిధులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో ఎదగాలి

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



నమోదు పత్రాలను అందచేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, జనవరి 31 : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా దివ్యాంగులందరూ సకలాంగులకు దీటుగా అన్ని రంగాల్లోనూ ఎదగాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపును ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అవిటితనం ఉందని ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగులందరూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రగతిబాట పట్టాలని ఆకాంక్షించారు. వైద్యాధికారులు సదరం క్యాంపులో లోపాలకు తావులేకుండా వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు చేపట్టాలన్నారు. సకలాంగులందరూ బాధ్యతాయుతమైన విధానాల ద్వారా దివ్యాంగులకు అవసరమైన సహయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సదరంలో క్యాంపులో దివ్యాంగుల నమోదును విభాగంలో పత్రాలను అందించి శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భైంసా ఎంపీపీ రజాక్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా.కాశీనాథ్, అర్థోపెడిక్ విభాగపు ఇంచార్జీ డా.ప్రీతమ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

తానూర్ : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే రాంరావుపాటిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ చంద్రకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతినివేదికలను చదివి వినిపించారు.గ్రామాల్లో మిషన్ భగీరథనీళ్లు సరిగ్గా రావడం లేదని మిషన్ భగీరథ అధికారిపై పలువురు సభ్యులు మండిపడ్డారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాంరావుపాటిల్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటూ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా పదవికాలం పూర్తయిన సర్పంచ్‌లను ఎమ్మెల్యే, వైస్ ఎంపీపీలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ఛైర్మన్ బాశెట్టి రాజన్న, తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్ పీఏసీఎస్ ఛైర్మన్ నారాయణ్ రావుపాటిల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాడేవార్ విఠల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పార్డి(బి) శివారులో చిరుత సంచారం

కుభీర్, జనవరి 31 : మండలంలోని పార్డి(బి), ధార్‌కుభీర్, గ్రామశివారులో చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారి కోటేశ్ తెలిపారు. ఈ గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండి రాత్రివేళలో చేన్లోకి ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు. రైతులు తమ పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయవద్దని సచించారు.

చెరువులో వ్యర్థాల తొలగింపు



చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

నిర్మల్ కల్చరల్, జనవరి 31 : నిర్మల్‌లోని బంగల్‌పేట్, ధర్మసాగర్ చెరువులో బుధవారం మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. పిచ్చ మొక్కలు తొలగించారు. జేసీబీ సహాయంతో శానిటేషన్ సిబ్బంది పిచ్చి మొక్కలు, తుమ్మచెట్లు తొలగించి శుభ్రపరిచారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగించారు. పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొంటాం

- మధ్యాహ్న భోజన కార్మికుల నోటీసు



సమ్మె నోటీసులు అందజేస్తున్న కార్మికులు

నిర్మల్ కల్చరల్, జనవరి 31 : ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొంటామని మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం డీఈవోకు నోటీసులు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్ ఆధ్వర్యంలో నాయకులు డీఈవో రవీందర్‌రెడ్డిని కలిశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 10 వేలు నెలసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిట్యాల లక్ష్మి, ఏనుగందుల లక్ష్మి, సాయవ్వ, మానస, తదితర కార్మికులు పాల్గొన్నారు.

నేడు ముథోల్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ముథోల్, జనవరి 31 : మండల కేంద్రమైన ముథోల్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ వైర్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా గురువారం నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఇట్టి విషయమై వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

ముథోల్, జనవరి 31 : ముథోల్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ పాలకవర్గానికి బుధవారం గ్రామ పంచాయతీలో ఘనంగా సన్మానించారు. తమకు ఐదు సంవత్సరాలు అధికారులు, నాయకులు, గ్రామస్థులు సహాయ సహకారాలు అందించడంతోనే అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో పోతన్నయాదవ్, జూనియర్ అసిస్టెంట్ అనూష సంజీవ్ తదితరులు ఉన్నారు.